నేటి కందం- నేటికి అందం



ప్రాకటముగ మొదలిడబడె
చేకూరగ పలు శుభములు శ్రేయము లమరన్
శాకంబరి యుత్సవములు
తేకువతో భద్రకాళి దివ్య కరుణతోన్ !!

శాకంబరి ఉత్సవాలు వరంగల్లు లోని భద్రకాళీదేవాలయంలో ప్రారంభం అయినాయి.

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

పరిసరాల కాలుష్యం
పట్టని మన ప్రభుత్వం
ప్రజారోగ్యాన్నింక ఏలా
పెట్టగలదు పటుత్వం
అందంగా పట్టణాల
అభివృద్ధనే మాటలు
ఆచరణలో కనిపించని
అన్ని నీటి మూటలు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ శుక్రవారం 11-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001. సంపుటి :31 సంచిక:251 పేజీలు:6 వెల: రూ.1/-


# ప్రధాని మోడీకి అపూర్వ గౌరవం..వరిస్తున్న అత్యున్నత పురస్కారాలు

-ముగిసిన అయిదు దేశాల పర్యటన
-ఢిల్లీకి చేరుకున్న ప్రధాని మోదీ
-ఈ టూర్‌లో మూడు దేశాల అత్యున్నత పురస్కారాలు
-ఇప్పటివరకు మోదీకి 27 అంతర్జాతీయ పురస్కారాలు

న్యూఢిల్లీ, జులై 10:ప్రధాని మోదీ తన ఎనిమిది రోజుల విదేశీ పర్యటన నేటితో ముగిసింది.. పర్యటనను ముగించుకుని గురువారం ప్రధాని ఢిల్లీ వచ్చేశారు. ఈ ఎనిమిది దేశాల



పర్యటలనో ఆయనకు అరుదైన గౌరవాలు లభించాయి. ఒకే పర్యటనలో ఏకంగా మూడు దేశాల అత్యున్నత పౌర పురస్కారాలను స్వీకరించారు. ఈ పర్యటనలో భాగంగా బ్రెజిల్ , నమీబియా, ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశాలు తమ అత్యున్నత పౌర పురస్కారాలను ప్రధాని మోదీకి అందించి సత్కరించాయి. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోదీ విదేశీ ప్రభుత్వాల నుంచి అందుకున్న అంతర్జాతీయ పురస్కారాల సంఖ్య దీంతో 27కు చేరింది.

### ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించేందుకు..

మొత్తం 8 రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో ప్రధాని మోదీ ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాతో సహా ఐదు దేశాలను సందర్శించారు. గ్లోబల్ సౌత్‌లో భారతదేశ ప్రభావాన్ని పెంచడం, ద్వైపాక్షిక సంబంధాలను పటిష్ఠం చేయడం, ఆర్థిక సహకారాన్ని ప్రోత్సహించడం ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యాలు. బ్రెజిల్‌లో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న మోదీ.. ప్రపంచ ఆర్థిక పాలన, సుస్థిర అభివృద్ధి వంటి అంశాలపై ఉన్నత స్థాయి చర్చలు జరిపారు. అలాగే, అర్జెంటీనాతో వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, రక్షణ రంగాల్లో సహకారంపై చర్చించగా.. ఘనా, నమీబియా దేశాల్లో మౌలిక వసతులు, విద్యా భాగస్వామ్యాలపై దృష్టి సారించారు. కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో పర్యటన ద్వారా ఇరు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మరింత బలపడ్డాయి.

# మున్సిపాలిటీల్లో హోర్డింగ్ల ఏర్పాటులో ద్వంద్వ నిబంధనలు

-హోర్డింగ్ల ఏర్పాటుపై వివరణ ఇవ్వండి
-రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
-తదుపరి విచారణ ఆగస్టు 6కు వాయిదా

హైదరాబాద్ జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో హోర్డింగ్ల ఏర్పాటులో ద్వంద్వ నిబంధనలు పాటిస్తున్నారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ఎంఏ యూడీ ముఖ్య కార్యదర్శి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, జీహెచ్ఎంసీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ (ప్రకటనలు) తదితరులకు నోటీసులు జారీ చేసింది.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో 15 అడుగుల కంటే ఎత్తున్న అన్ని ఎస్ఈడీ హోర్డింగ్లను తొలగించాలని ప్రభుత్వం జీవో 68 జారీ చేసింది. తొలగింపు చర్యలను నిలిపివేయాలని కోరుతూ 2024, జనవరి 25 నుంచి 2025, జూన్ 26 వరకు 19సార్లు వినతిపత్రాలు సమర్పించినా అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదంటూ తెలంగాణ ఔట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ సహా 53 ప్రకటన సంస్థలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. కొన్ని ప్రకటన సంస్థలకు ఇచ్చిన సడలింపును తమకు అమలు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్ జస్టిస్ బి. విజయ్సేన్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ. 'ఎంపిక చేసిన కంపెనీలకు సడలింపు ఇవ్వడం చట్ట బద్ధంగా అన్యాయం. పిటిషనర్ అసోసియేషన్, దాని సభ్యులు మున్సిపల్, రాష్ట్ర చట్టాలను కచ్చితంగా పాటిస్తున్నారు. జీహెచ్ఎంసీ, పట్టణ స్థానిక సంస్థలకు ప్రకటన రుసుములలో ఏటా కోట్లాది రూపాయలను చెల్లిస్తోంది. రాష్ట్రంలో లక్ష మందికి పైగా వ్యక్తులకు ఉపాధి కల్పిస్తోంది. వీరిలో కొందరికి ఒకలా.. మరికొందరికి మరోలా నిబంధనలు వర్తింపజేయడం సరికాదు. పిటిషనర్ అసోసియేషన్ ఇచ్చిన వినతిపత్రాలపై నిర్ణయం తీసుకునేలా అధికారులను ఆదేశించాలి. 15 అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో హోర్డింగ్ల ఏర్పాటుకు అనధికారిక ప్రతివాదులకు ఇచ్చిన సడలింపులను పిటిషనర్లకు వర్తింపజేయాలి' అని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తదుపరి విచారణ ఆగస్టు 6కు వాయిదా వేస్తూ ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది విచారణ వాయిదా వేశారు.

# ఈ 20న దేవరకొండ పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి

దేవరకొండ రూరల్, జులై 10 : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 20న నల్లగొండ జిల్లా దేవరకొండ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటనను పురస్కరించుకుని హెలిప్యాడ్ స్థలాన్ని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గురువారం దేవరకొండ ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణా రెడ్డి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. పర్యటనలో భాగంగా సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.



# నేటి నుండి లాల్ దర్వాజా బోనాలు.. ప్రారంభించనున్న సీపీ, జీహెచ్ఎంసి కమిషనర్

హైదరాబాద్, జులై 10:ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలకు లాల్ దర్వాజా సింహవాహిని ఆలయం ముస్తాబైనట్లు ఆలయ కమిటీ చైర్మన్ మారుతి యాదవ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వైభవంగా, ప్రతిష్టాత్మకంగా జరుపుకునే పాతబస్తీ లాల్ దర్వాజ శ్రీ సింహవాహిని మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు రేపటి నుండి ప్రారంభం కానున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సంవత్సరం నిర్వహించే 117వ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించుటకు దేవాలయ కమిటీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసిందన్నారు. రేపటి నుంచి నుండి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలలో తొలిరోజైన శుక్రవారం ఉదయం గణపతి హోమం, సప్తశతి పారాయణం తదుపరి ఉ. 8:30 గంటలకు దేవి అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శిఖర పూజ : బోనాల ఉత్సవాలా ప్రారంభ వేడుకలను పురస్కరించుకుని ముందుగా శిఖర పూజతో వేడుకలు ఆరంభిస్తామని చైర్మన్ మారుతి యాదవ్ తెలిపారు. ఉ. 10:30 నిమిషాలకు శిఖరపూజ, ధ్వజారోహణ కార్యక్రమాన్ని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణణ్ కలిసి పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. అమ్మవారికి శిఖరపూజ, ధ్వజారోహణ గావించిన అనంతరం ఉత్సవాలను లాంఛనంగా కొనసాగుతాయన్నారు. సాయంత్రం 6:00 గంటలకు ఆలయ కమిటీ చైర్మన్ కుటుంబ సభ్యులతో కలిసి కలశ స్థాపన చేస్తారని ఆలయ ప్రతినిధులు తెలిపారు.



# ఫోర్జరీ డాక్యుమెంట్స్.. నిధుల దుర్వినియోగం..
# హెచ్‌సిఏ అధ్యక్షుడితో సహా అయిదుగురి అరెస్ట్

-హెచ్ సి ఎ అధ్యక్షుడితో సహా అయిదుగురి అరెస్ట్
-నకిలీ డాక్యుమెంట్స్ తో అధ్యక్షుడిగా జగన్మోహన్ ఎన్నిక
-ఏకంగా మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ సంతకం ఫోర్జరీ
-సన్ రైజర్స్ మేనేజ్మెంట్ కు టికెట్ల పేరుతో వేధింపులు
-విజిలెన్స్ నివేదికలో వెల్లడైన జగన్మోహన్ అక్రమాలు

హైదరాబాద్, జులై 10: హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగం కేసులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్‌తో పాటు నలుగురిని అరెస్ట్ చేశారు. ట్రెజరర్ శ్రీనివాసరావు, జనరల్ సెక్రెటరీ రాజేంద్ర యాదవ్, సీఈవో సునీల్ కంటేతో పాటు రాజేంద్ర యాదవ్ భార్య కవితను అరెస్ట్ చేశారు. గౌలిపురాలోని శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ అధ్యక్షురాలుగా కవిత ఉన్నారు. హెచ్ సి ఎ ప్రెసిడెంట్ అరెస్ట్ అనంతరం సీఐడీ కీలక విషయాలను వెల్లడించింది. శ్రీచక్ర క్రికెట్ క్లబ్ పేరుతో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మో హన్ రావు నకిలీ పత్రాలు సృష్టించా డు. గౌలిపురా క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్ సంతకం ఫోర్జరీ చేశారు. అలాగే కృష్ణాయాదవ్ సంతకాన్ని శ్రీచక్ర క్రికెట్ క్లబ్ ప్రెసిడెంట్ కవిత ఫోర్జరీ చేసింది. కవిత ఈ పత్రాలను జగన్మోహన్ రావుకు అందించింది. ఈ పత్రాలను ఉపయోగించి జగన్మోహన్ రావు హెచ్‌సీఏ అధ్యక్షుడయ్యారు.

బాధ్యతలు చేపట్టిన తర్వాత నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడనేది జగన్మోహన్ రావుపై ప్రధాన అభియోగం. నిధుల దుర్వినియోగం జరిగిందని టీసీఏ అధ్యక్షుడు గురువారెడ్డి సీఐడీకి ఫిర్యాదు చేయడంతో సీఐడీ రంగంలోకి దిగింది. జగన్మోహన్‌రావుకు , కోశాధికారి శ్రీనివాస్ రావు, సీఈవో సునీల్ సహకరించినట్లు సిఐడి గుర్తించింది. జగన్మోహన్



రావుతో పాటు మరో నలుగురిని అరెస్ట్ చేయడంతో ఈ అంశం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

### సన్ రైజర్స్ కూ వేధింపులు

ఐపీఎల్ క్రికెట్ టీ-20 టికెట్లు, ఫ్రీ పాసుల కేటాయింపులకు సంబంధించి సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య కుదుర్చుకున్న ఒప్పందంలో పేర్కొన్న టికెట్ల కంటే పది శాతం అదనంగా ఇవ్వాలని హెచ్‌సీఏ ఒత్తిడి చేసినట్లు దర్యాప్తులో గుర్తించారు. వ్యక్తిగతంగా టికెట్లు ఇవ్వకపోవడంతో జగన్‌మోహన్‌రావు ఇబ్బందులకు గురి చేసినట్లు సీఐడీ విచారణలో వెలుగు చూసింది. లక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ గ్యాలరీలకు కూడా తాళాలు వేసి తీవ్ర ఇబ్బందులకు గురి చేసినట్లుగా ఆధారాలు సేకరించింది. ఈ మేరకు హెచ్‌సీఏ, ఎస్ఆర్‌హెచ్ మధ్య మెయిల్స్ సహా అదనపు టికెట్ల కోసం హెచ్‌సీఏ ప్రతినిధులు బెదిరింపులకు పాల్పడిన అంశాలను ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధుల నుంచి రికార్డులు సేకరించారు. ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణతో పాటు, హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాలు, స్టేడియం నిర్వహణ అంశాలకు సంబంధించిన డాక్యుమెంట్లను కూడా సీఐడీ సేకరించింది. పూర్తి డాక్యుమెంట్లతో సహా వివాదానికి గల కారణాలకు సంబంధించి విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా ఐదుగురిని అరెస్ట్ చేసింది.

# సీజనల్ వ్యాధులు రాకుండా రాపిడ్ ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

నార్నూర్, జులై 10: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా రాపిడ్ ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ డీఎంహెచ్ వో కుడ్మెత మనోహర్ వైద్య సిబ్బందికి సూచించారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం ధాబా కె గ్రామంలో ఝరి ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రాపిడ్ ఫీవర్ సర్వే శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సేవల తీరును పరిశీలించారు.

ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని,



ప్రజలకు మెరుగైన వైద్య సేవను అందించేలా కృషి చేయాలన్నారు, గ్రామాలలో అపరిశుభ్రత లోపించకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలన్నారు. పరిశుభ్రతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.రాపిడ్ ఫీవర్ సర్వేలో భాగంగా ప్రతి ఒక్కరి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వందశాతం ప్రసవాలు జరిగేలా చూడాలని గుర్తించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి సంజీవ్, ఎంవో నాందేవ్, హెచ్ఈవో ఆడే సంజయ్, హెచ్ ఎస్ శ్రీదేవి, వైద్య సిబ్బంది సురేఖ, రత్న, కల్పన, ప్రకాష్, మోహన్ తదితరులు ఉన్నారు.

# ఇసుక క్వారీల పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలి : ఏఎస్పీ

-నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

ములుగుజులై 10: ములుగు జిల్లా ఏటూర్ నాగారం ఏఎస్పీ పరిధిలోని ఇసుక క్వారీల వాళ్లు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకుని ఆ స్థలంలో మాత్రమే ఇసుక లారీలను పార్కింగ్ చేసుకోవాలని నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ ధర్మారం ఇసుక క్వారీకి లోడింగ్ కోసం వచ్చే లారీల వలన పార్కింగ్ స్థలం కానటువంటి రోడ్లపైన లారీల డ్రైవర్లు ఇష్టం వచ్చినట్లు పార్కింగ్ చేయడంతో ధర్మారం నుండి చెరుకూరు గ్రామాల మధ్యలో ట్రాఫిక్ జామ్ అయ్యింద న్నారు.

దీంతో పేరూరు, అయ్యవారిపేట, ధర్మారం, చెరుకూరు గ్రామప్రజల ప్రయాణానికి ఆటంకం కలుగడంతో పేరూరు ఎస్ఐ జి.కృష్ణ ప్రసాద్ తన సిబ్బందితో 11నుండి 1 గంటల వరకు ట్రాఫిక్ క్లియర్ చేసి రాంగ్ పార్కింగ్ లో నిలిపినటువంటి 30లారీలకు ఫైన్ విధించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఏటూరునాగారం ఏఎస్పీ మాట్లాడుతూ కచ్చితంగా ఇసుక క్వారీ నిర్వహించే ధర్మారం, టేకులగూడెం యజమానులు తప్పని సరిగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలని హెచ్చరించారు. అలాగే 163జాతీయ రహదారిపైన వాహనాలు నిలుపరాదు, డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, అతివేగంతో వాహనాలు నడపకూడదని సూచించడం జరిగిందన్నారు.

## స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

హైదరాబాద్, జులై 10:స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా తనను నేరుగా కలువాలని సూచించారు. గురువారం బోయిన్ పల్లిలోని క్యాంపు కార్యాలయంలో మౌలాలి డివిజన్ హనుమాన్ నగర్ లోని స్మశాన వాటికను అభివృద్ధి పరచాలని కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంశీ ముదిరాజ్, ఎండీ ఉస్మాన్, మారుతి ప్రసాద్, దుర్గేష్, స్వామి, జంగయ్య, బస్తీ వాసులు, కిరణ్ కుమార్, విజయలక్ష్మి, లక్ష్మి, పింటూ, విజయ్, సరస్వతి, లలిత, రాజమణి, ప్రవీణ్, కృష్ణ, సంగీత, శివమ్మ, విజయలక్ష్మి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగుపై రైతులను ప్రోత్సహించాలి

హైదరాబాద్, జులై 10: ఉద్యాన శాఖ పెద్దపల్లి జిల్లాలో ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ పంటను సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ జిల్లా ప్రత్యేక అధికారి టి.శేఖర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని నీరుకుల్లా, కాట్నపల్లి గ్రామంలో గురువారం అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా రైతు కొండపల్లి సత్యనారాయణ రావు క్షేత్రంలో 17 ఎకరాలలో ఆయిల్ ఫామ్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్ సందర్శించారు. ఇందులో భాగంగా ఆయిల్ పామ్ పంటను రైతులు పెద్ద ఎత్తున సాగు చేయాలని ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటలో అంతర పంటగా కూరగాయలు, పూల తోటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందాలని వివరించారు.

తదనంతరం బొంతకుంటపల్లి గ్రామంలోని రెండు సంవత్సరాల కిందట నాటిన ఆయిల్ పామ్ తోటలను పరిశీలించడం జరిగింది. అనంతరం ఎలిగేడు, జూలపల్లి మండలంలోని కూరగాయ పంటలను, శాశ్వత పందిర్ల నిర్మాణంపై సాగు చేసే ఉద్యాన పంటలను కూడా పరిశీలించడం జరిగింది. జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయములోని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులతో, ఆయిల్ ఫామ్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్‌తో, డిప్ కంపెనీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా 2025 -26 సంవత్సరంలో కేటాయించిన పండ్ల తోటలో విస్తీర్ణ పథకం ఎంఐడిహెచ్ స్కీం ద్వారా పండ్లతోటలైన మామిడి, జామ, అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ వంటి పండ్లతోటలు, కూరగాయ పంటలైన టమాట, మిరప, వంకాయ వంటి కూరగాయలను మల్చింగ్ పద్ధతి ద్వారా 50 % రాయితీ, బిందు సేద్య పరికరాల పైన 90% రాయితీ జిల్లాలోని సాగు చేసే రైతులకు అందేలా ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించడం జరిగింది.

ఇందులో భాగంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసినందుకు గాను ఎకరానికి రూ. 4200 అంతర పంటలకి రాయితీ కల్పించడం జరుగుతుందని అన్నారు. రైతులు అందరూ ఈ వానాకాలంలో ఆయిల్ పామ్ పంటను సాగు చేయాలని రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారులు ఏ. జ్యోతి, ఎన్.మహేష్, ఆయిల్ పామ్ కంపెనీ సీఈవో కేసు కళ్యాణ్, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీధర్, శివ, అభిలాష్, డ్రిప్ కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్లు, రైతులు ప్రేమ సాగర్, రాజేశ్వరరావు, మంద మల్లేశం రామచంద్రం తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఉజ్జయిని అమ్మవారికి పసిడి బోనం



హైదరాబాద్, జులై 10: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల నేపథ్యంలో భాగ్యనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమం వరుసగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే గోల్కొండ జగదాంబ అమ్మవారితో పాటుగా విజయవాడ కనకదుర్గ అమ్మవారికి, మూడో బోనం బల్కంపేట ఎల్లమ్మ తల్లికి, నాలుగవ బోనం జూబ్లీహిల్స్ పెద్దమ్మ అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. అందులో భాగంగా 5వ బోనం గురువారం అక్కన్న మాదన్న దేవాలయంలో భాగ్యనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్ ఆధ్వర్యంలో హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాంప్రదాయంగా ముస్తాబు చేసిన బంగారు బోనాన్ని జోగిని నిషా క్రాంతి తలపై ధరించగా వాయిద్యాల నడుమ సికింద్రాబాద్ ఉజ్జయిని అమ్మ వారి దేవాలయానికి బయల్దేరింది. ఈ కార్యక్రమంలో ఊరేగింపు కమిటీ ప్రతినిధులు గురునాథ్ రెడ్డి, శ్రీకాంత్, వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులు డి ప్రభాకర్, మారుతి యాదవ్, సదానంద్ యాదవ్, మధు యాదవ్, ఆదార్ల మహేష్, రామ్ దేవ్ అగర్వాల్, జాగ్ మోహన్, కృష్ణ చేతన్ నూరి, నతీష్, తదితరులు పాల్గొన్నారు.

# బ్రెజిల్ అధ్యక్షునితో ప్రధానమంత్రి సమావేశం

న్యూఢిల్లీ, జులై 10:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ బ్రెజిలియాలో అధికారిక పర్యటన చేపడుతున్నారు. బ్రెజీలియాలోని అల్వరాడో ప్యాలెస్‌లో బ్రెజిల్ అధ్యక్షుడు గౌరవ లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వాతో ఈ రోజు సమావేశమయ్యారు. అధ్యక్షుడు లూలా ప్రధానికి ఆత్మీయ స్వాగతం పలికారు.

పరిమితమైన, ప్రతినిధి స్థాయి విధానాల్లో జరిగిన చర్చల్లో ప్రధానమంత్రి, అధ్యక్షుడు లూలా పాల్గొన్నారు. భారత్, బ్రెజిల్ మధ్య బహుముఖ వ్యూహాత్మక భాగస్వామానికి సంబంధించిన అన్ని అంశాలపై చర్చించారు. రెండు దేశాల మధ్య నెలకొన్న స్నేహపూర్వక సంబంధాలకు ఆధారమైన ఉమ్మడి విలువలను పునరుద్ఘాటించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ రంగం, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి, డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, యూపీఐ, సంప్రదాయ వైద్యం, యోగా, క్రీడా సంబంధాలు, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు తదితర అంశాల్లో సహకారంపై ఇరువురు నాయకులు చర్చించారు. కీలకమైన ఖనిజాలు, నూతనంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు, ఏఐ, సూపర్ కంప్యూటర్లు, డిజిటల్ భాగస్వామ్యం, వాహన రంగం తదితర ఆధునిక రంగాల్లో సహకారానికి ఉన్న అవకాశాన్ని వారు అన్వేషించారు.

వాణిజ్యం, వ్యాపారాంశాల్లో చర్చలు నిర్వహించడానికి మంత్రిత్వ స్థాయి యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడాన్ని ఇద్దరూ స్వాగతించారు. భారత్-మెర్కోసుర్ ప్రాధాన్య వాణిజ్య ఒప్పందం విస్తరణతో సహా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని బలోపేతం చేయడంపై చర్చించారు. వచ్చే ఐదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 20 బిలియన్ అమెరికన్ డాలర్లకు విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇంధన రంగంలో కొనసాగుతున్న సహకారాన్ని సమీక్షించారు. అలాగే హైడ్రో కార్బన్, పునరుత్పాదక రంగాల్లో రెండు దేశాలకు అపారమైన సామర్థ్యం ఉన్న నేపథ్యంలో పెట్టుబడి అవకాశాలను అన్వేషించేందుకు అంగీకరించారు.

2025, ఏప్రిల్ నెలలో పహల్గాంలో ఉగ్రవాదులు చేసిన క్రూరమైన దాడి అనంతరం భారత్‌కు సంఘీభావం, మద్దతు అందించిన బ్రెజిల్‌కు ప్రధాని ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దాన్ని ఎదుర్కోవాలనే రెండు దేశాల దృఢచిత్తాన్ని తెలియజేస్తోంది. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితిల్లోనూ ఉపేక్షించరాదని, ఇలాంటి అమానవీయ చర్యలను ప్రోత్సహించేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఉగ్రవాదంతో పోరాటం చేయడానికి, దాన్ని అంతమొందించడానికి అంతర్జాతీయ సమాజంతో కలసి రెండు దేశాలు పని చేయడానికి అధ్యక్షుడు లూలా అంగీకరించారు.

ఉమ్మడి ఆసక్తి ఉన్న ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై తమ ఆలోచనలను నాయకులిద్దరూ పంచుకున్నారు. బహుపాక్షిక విధానం, ఐక్యరాజ్యసమితి భద్రతామండలితో సహా అంతర్జాతీయ పాలనా సంస్థలను సంస్కరించడం పట్ల తమ నిబద్ధతను తెలియజేశారు. వాతావరణ మార్పులను ఎదుర్కోవడంలో అంతర్జాతీయ చర్యలను బలోపేతం చేయడానికి కలిసి పనిచేయాలని ఇద్దరు నాయకులు అంగీకరించారు. కాప్30 వాతావరణ మార్పుల సదస్సును నిర్వహించనున్న నేపథ్యంలో బ్రెజిల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్లోబల్ సౌత్ ఆసక్తులను ముందుకు తీసుకెళ్లడానికి కలిసి పనిచేసేందుకు అంగీకరించారు.

చర్చల అనంతరం, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం, భద్రతా సంబంధమైన సమాచార మార్పిడి, వ్యవసాయ పరిశోధన, పునరుత్పాదక ఇంధన, మేధోసంపత్తి హక్కులు, డిజిటల్ సహకారం (ఇండియా స్టాక్) రంగాల్లో ఆరు ఎంవోయూలు ళివివరాలను ఇక్కడ చూడొచ్చురి ఖరారయ్యాయి. అధికారిక పర్యటనలో సంయుక్త ప్రకటన ళిలింక్‌రి జారీ చేశారు.

ప్రధానమంత్రి గౌరవార్థం అధ్యక్షుడు లూలా విందును ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు లూలా ఆతిథ్యానికి ప్రధాని ధన్యవాదాలు తెలియజేశారు. భారత్‌ను సందర్శించాలని ఆహ్వానించారు.

# తగ్గుతున్న పత్తి దిగుబడి సమస్య పరిష్కారం కోసం ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసిన కేంద్ర వ్యవసాయ మంత్రి

న్యూఢిల్లీ, జులై 10:ఇటీవల బీటీ పత్తిని ఆశించిన టీఎస్‌వీ వైరస్ ప్రభావం కారణంగానూ, మొత్తంగా దేశంలో పత్తి దిగుబడి తగ్గడం పట్ల కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖా మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పత్తి రైతుల సమస్యలను ప్రస్తావించిన కేంద్ర మంత్రి.. సాగు ఖర్చులను తగ్గిస్తూనే పత్తి దిగుబడిని పెంచడం పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని పునరుద్ఘాటించారు.

ఈ లక్ష్యం దిశగా పటిష్టమైన చర్యలు చేపట్టడం కోసం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం 10 గంటలకు కోయంబత్తూరులో ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పత్తి రైతులు, సంబంధిత అధికారులు, సంస్థలు, నిపుణులు సహా ఈ రంగానికి సంబంధించిన ముఖ్యులంతా ఈ సమావేశంలో పాల్గొననున్నారు:

పత్తి సాగుచేసే రైతులు, రైతు సంఘాలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) నుంచి డైరెక్టర్ జనరల్ సహా సీనియర్ శాస్త్రవేత్తలు, ప్రధానంగా పత్తి సాగు చేసే రాష్ట్రాల వ్యవసాయ మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, వ్యవసాయ విశ్వవిద్యాలయాల నుంచి నిపుణులు, పత్తి పరిశ్రమ ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు.

"వైరల్ దాడులను, వాతావరణ మార్పులను తట్టుకోగలిగే అధిక-నాణ్యత గల విత్తనాలను అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. దేశంలో పత్తి దిగుబడినీ, నాణ్యతను పెంచడానికి శాస్త్రీయమైన, ఆచరణీయ పరిష్కారాలను కనుగొనడం లక్ష్యంగా ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో కృషి చేస్తోంది" అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా పత్తి రైతులు, సంబంధిత వ్యక్తులు సూచనలు ఇవ్వాల్సిందిగా శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఆహ్వానించారు. మంత్రిత్వ శాఖ టోల్-ఫ్రీ నంబర్ 1800 180 1551 ద్వారా సూచనలు అందించవచ్చని తెలిపారు.

"మీరు చేసిన సూచనలన్నీ పూర్తి శ్రద్ధతో నేను స్వయంగా సమీక్షిస్తాను. దేశంలో పత్తి సాగు భవిష్యత్తును సురక్షితంగా ఉంచడం కోసం మనమంతా ఐక్యంగా ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించుకుందాం" అని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

రైతులకు అండగా ఉండటంతో పాటు పత్తి సాగులో సుస్థిరమైన వృద్ధిని సాధించడం పట్ల మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు.

# పవన్ కల్యాణ్ సవాల్‌ను స్వీకరించిన మంత్రి లోకేష్..

## -కోటి మొక్కలు నాటేందుకు సై అన్న మంత్రి
## -విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతాం

అమరావతి, జులై 10:జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విసిరిన సవాల్‌ను స్వీకరించారు మంత్రి నారా లోకేష్.. తాను అన్న పవన్ చాలెంజ్ కు రెడీ



అని ప్రకటించారు.. మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్ సందర్భంగా.. శ్రీ సత్యసాయి జిల్లాలో పర్యటించిన ఆయన ముందుగా మీడియాతో మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ చాలెంజ్ గురించి వివరించారు.

ఆ మధ్య అమరావతి రాజధాని ప్రాంతం అనంతవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అన్నారు.. మేం మొక్కలు నాటుతున్నాం.. మీరు మొక్కలు నాటేందుకు సిద్ధమా అని సవాల్ చేశారు.. ఇక, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోటి మొక్కలు నాటాలన్న సవాల్ ను నేను స్వీకరిస్తున్నాను అని ఈ రోజు వ్యాఖ్యానించారు మంత్రి నారా లోకేష్.. ఒక్క విద్యాశాఖ ద్వారానే కోటి మొక్కలు నాటుతామని ప్రకటించారు..

# పుట్టపర్తిలో లోకేష్‌కు సమస్యల నివేదన..పరిష్కరిస్తానని భరోసా



శ్రీసత్యసాయి, జులై 10: శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జెడ్పీ పాఠశాలలో మెగా పీటీఎం-2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గురువారం పుట్టపర్తి వచ్చారు. కప్పలబండ పారిశ్రామిక వాడలో ప్రజలు, కార్యకర్తలను మంత్రి కలుసుకున్నారు. అనంతరం ప్రతి ఒక్కరితో కలిసి ఫొటోలు దిగారు. ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలకరించారు. వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ప్రతి అర్జీని పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి , ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కడపలోని వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు మంత్రి లోకేశ్ ను కలుసుకున్నారు. యూనివర్సిటీ గుర్తింపు విషయంలో నెలకొన్న సమస్యను పరిష్కరించాలని విద్యార్థులు విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంతో పాటు జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంత్రి లోకేశ్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. తల్లికి వందనం పథకం కింద సాయం పొందిన పి.మాధవి, ఆమె నలుగురు పిల్లలతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కొత్త చెరువు బీసీ కాలనీకి చెందిన పి.మాధవికి ఎనిమిదో తరగతి చదివే బాలు, ఏడో తరగతి చదివే నరసమ్మ, ఐదో తరగతి చదివే బేబీ, మూడో తరగతి చదివే సన అనే నలుగురు పిల్లలు ఉన్నారు. మాధవి నలుగురు పిల్లలకు తల్లికి వందనం పథకం కింద రూ.52వేల సాయం అందింది. ఈ సందర్భంగా మాధవితో మంత్రి మాట్లాడుతూ.. పాఠశాలలో వసతులు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. యూనిఫాం, మధ్యాహ్న భోజనం నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బాగుందని ఈ సందర్భంగా విద్యార్థులు చెప్పారు.

అనంతరం మాధవి మాట్లాడుతూ.. తల్లికి వందనం పథకం కింద తమకు రూ.52 వేల సాయం అందిందని, ఆ మొత్తాన్ని పిల్లల పేరుమీద బ్యాంకులో వేశామని మంత్రికి తెలిపారు. దీనిపై మంత్రి లోకేశ్ సంతోషం వ్యక్తంచేస్తూ.. పిల్లలను బాగా చదివించాలని, వారి ఉన్నత చదువుల బాధ్యత తీసుకుంటామని మాధవికి హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం అందిస్తున్నామని, పుస్తకాల బ్యాగ్ బరువు తగ్గించేందుకు సెమిస్టర్ విధానం తీసుకువచ్చామని, వర్క్ బుక్‌లు అందజేశామని మంత్రి వివరించారు. బాగా చదువుకోవాలని, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని పిల్లలకు సూచించారు. కాగా, తల్లికి వందనం కింద నలుగురు పిల్లలకు సాయం అందించడంతో పాటు.. మంత్రి నారా లోకేశ్ తమ పట్ల చూపించిన ఆప్యాయత పట్ల మాధవి, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

# రాష్ట్ర రైతుల వాస్తవ డిమాండ్‌ను తీర్చేందుకు అన్ని రకాలుగా మద్దతిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, జులై 10:తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందంతో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా నిన్న సమావేశమయ్యారు. తెలంగాణ రాష్ట్రంలో ఎరువుల లభ్యత గురించి చర్చించారు. వానాకాలం సీజన్ ఊపందుకున్నందుకు జూలై, ఆగస్టు నెలల్లో నిరంతరాయంగా యూరియా సరఫరా చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి విన్నవించారు. రాష్ట్ర రైతుల వాస్తవ డిమాండ్‌ను తీర్చేందుకు తెలంగాణ ముఖ్యమంత్రికి అన్ని రకాలుగా మద్దతిస్తామని జేపీ నడ్డా హామీ ఇచ్చారు. అవసరానికి అనుగుణంగా సరఫరాలు ఉండేలా చూసుకోవాలని ఎరువుల శాఖ అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. యూరియా వినియోగం రాష్ట్రంలో అధికంగా ఉందని, ఇది దీర్ఘకాలంలో నేల ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 2023-24 యాసంగి సీజన్‌తో పోలిస్తే 2024-25 అదే సీజన్‌లో అదనంగా 21% యూరియా విక్రయాలు జరిగాయి. 2025 వానాకాలంలో ఇప్పటివరకు 12.4% అదనపు వినియోగం( 2024 వానాకాలం ఇదే కాలంతో పోలిస్తే) నమోదైంది.రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన పీఎం ప్రాణం పథకం గురించి ఎరువుల శాఖ కార్యదర్శి శ్రీ రజత్ కుమార్ మిశ్రా తెలియజేశారు. ఇది ఎరువుల స్థిర, సమతుల్య వినియోగం.. ప్రత్యామ్నాయ ఎరువులు వాడకం.. సేంద్రీయ, సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా రాష్ట్రాలకు మద్దతునిస్తోంది. వ్యవసాయేతర అవసరాలకు యూరియాను మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని, వివిధ జిల్లాల మధ్య ఎరువులు సమాన పంపిణీ ఉండేలా చూసుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వ అధికారులను కోరారు.

ఈ సమావేశంలో పార్లమెంటు సభ్యులు శ్రీ మల్లు రవి, శ్రీ చామల కిరణ్ కుమార్ రెడ్డి.. ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి శ్రీ ఏ.పి. జితేందర్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వ ఎరువుల శాఖ, తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సనాతన హిందూ మతం విశ్వ శాంతిని కోరుతోంది - శ్రీమాన్ బ్రహ్మానందగిరి స్వామీజీ



హైదరాబాద్, జులై 10:హిందూ మతం సనాతనమైనది, విశ్వ శాంతిని ఆకాంక్షించే ఏకైక మతం అని కరీంనగర్‌లోని పరందామాశ్రమానికి చెందిన శ్రీ శ్రీ బ్రహ్మానందగిరి స్వామి జీ అన్నారు. ఈ రోజు వ్యాస పూర్ణిమ శుభ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ విభాగం నిర్వహించిన కార్యక్రమంలో స్వామిజీ గారికి పాద పూజ చేసి, గురు పరంపరకు నిదర్శనంగా శాలువాతో సత్కరించి పూలు, పండ్లు, దక్షిణ సమర్పించి ఆశీస్సులు తీసుకున్న సందర్భంగా ప్రవచనం చేసి మాట్లాడుతూ, నాటి గురువులు దక్షిణా మూర్తి, విశ్వామిత్రుడు, వ్యాస మహర్షి, శంకరాచార్య లాంటి ఎందరో మహా గురువులు సత్య ధర్మాల మార్గాలను హితబోధ చేశారని, అలాంటి గురువులు చూపిన బాటన నడవడమే కలియుగ మానవాళి కనీస బాధ్యత అని హితబోధ చేశారు. ఈ సందర్భంగా విశ్రాంత ప్రిన్సిపాల్ కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మహా భారతం, 18 పురాణాలు, వేదాలను నాలుగు విభాగాలుగా సామవేదం, ఋగ్వే దం, అథర్వవేదణ, యజుర్వే దాలుగా విభజించి తర్వాత మానవ తరాలకు అందించారని గుర్తు చేశారు. గురువులకు గురువైన వేద వ్యాస మహర్షి సప్త చిరంజీవుల్లో ఒకడిగా మనతోనే ఉన్నాడని తెలిపారు. గీత మందిరానికి చెందిన శ్రీ శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి గారికి గురు వందనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డితో పాటు విహెచ్‌పి బాధ్యులు విహెచ్‌పి గోరక్ష రాష్ట్ర కమిటీ సభ్యులు కోమళ్ల రాజెందర్ రెడ్డి, రాష్ట్ర గోరక్ష కమిటీ మెంబర్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, ఏ విద్యాసాగర్ జిల్లా కార్యదర్శి, సహ కార్యదర్శి తోట రాజెందర్, గుండా రాధాకిషన్ స్వా మి, విహెచ్‌పి జిల్లా కమిటీ సభ్యులు పాల్గొని గురువులను పాద పూజ చేశారు.

# కన్నుల పండుగగా ఆదిదంపతుల గిరి ప్రదక్షణ..

## -ఇంద్రకీలాద్రి చుట్టూ విహరించిన గంగా పార్వతీ సమేత మల్లేశ్వరులు
## -భజన సంకీర్తనలు, కోలాటాలు, నృత్య ప్రదర్శనలు నడుమ
## -స్వామివారిని అమ్మవారిని అనుసరించిన భక్తులు..
## -ఆహ్లాదకర, భక్తి వాతావరణంలో ప్రదక్షణ


అమరావతి, జులై 10:ఆదిదంపతుల గిరి ప్రదక్షణ అత్యంత వైభవంగా, భక్తి ప్రవర్తులు, ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. విశ్వావసు నామ సంవత్సర ఆషాఢ పౌర్ణమి సందర్భంగా గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వారి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ అత్యంత వైభవంగా కొనసాగింది. సాక్షాత్తు కనకదుర్గమ్మ వారి కొలువైయున్న ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేయడం వలన కోరిన కోరికలు తీరుతాయని ప్రతీతి.

పౌర్ణమి రోజున సకల దేవతలు కొలువైన ఇంద్రకీలాద్రిగిరి ప్రదక్షిణ చేయడం మరింత శ్రేష్టంగా మన ఇతిహాసాలు చెబుతున్నాయి. గురువారం పౌర్ణమి సందర్భంగా ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుండి ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ వైభవంగా ప్రారంభమైంది. ఆలయ కార్యనిర్వహణాధికారి వి. కె. శీనానాయక్ దంపతులు ప్రత్యేక



పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి కార్యక్రమంను ప్రారంభించారు.

తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళవాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ గిరి ప్రదక్షిణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఘాట్ రోడ్ అమ్మవారి గుడి, కుమ్మరి పాలెం సెంటర్, విద్యాధరపురం, పాల ప్యాక్టరీ, చిట్టినగర్, కొత్త పేట, బ్రాహ్మణ వీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరి ప్రదక్షిణ కొనసాగింది. వేలాది మంది భక్తులు విశేషంగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. నగర పురవీధుల్లో ఇంద్రకీలాద్రి చుట్టూ విహరించిన అమ్మవారిని స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని భక్తి పారవస్యానికి లోనయ్యారు.



# శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా స్మారక స్టాంపును విడుదల చేసిన తపాలాశాఖ

న్యూఢిల్లీ, జులై 10:ఢిల్లీలోని సిరిఫోర్ట్ ఆడిటోరియంలో జరిగిన భారీ కార్యక్రమంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకొని ఆయన స్మారక స్టాంపును తపాలా శాఖ విడుదల చేసింది.

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశభక్తికి సంబంధించిన వాయిద్య ప్రదర్శనతో పాటు శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం, ఆయన అందించిన ఘన వారసత్వం, ఆయన చేసిన కృషి ఇతివృత్తంతో వివిధ ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు.

కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర) డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో స్టాంపు ఆవిష్కరణ జరిగింది. మొదటి స్టాంపు ఆల్బమ్‌ను ఢిల్లీ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కల్నల్ అఖిలేష్ కుమార్ పాండే ఆవిష్కరించారు. సీనియర్ ప్రభుత్వ అధికారులు, వివిధ సంస్థ అధిపతులు, ఇతర ప్రముఖులు హాజరవ్వటంతో ఈ కార్యక్రమం ప్రాముఖ్యత పెరిగింది.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని స్మారక పోస్టల్ స్టాంపు విడుదల

ఈ కార్యక్రమంలో పలువురు ప్రసంగించారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకు చెందిన వారు శక్తివంతమైన సందేశంతో కూడిన నాటకాన్ని ప్రదర్శించారు. ఒక ఆకర్షణీయ లఘు డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. ఇవన్నీ భారతీయ విద్య, పరిశ్రమలు, రాజ్యాంగాభివృద్ధితో పాటు వివిధ అంశాల్లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ చేసిన కృషిని, దాని ప్రభావాన్ని తెలియజేశాయి.

శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన స్మారక పోస్టల్ స్టాంపు

శ్రీమతి నేనుగుప్తా ఈ స్టాంపును రూపొందించారు. భారతీయ విలువల్లో ఉన్న విద్య, జాతీయ ఐక్యత, సమ్మిళిత అభివృద్ధిలో ఆయన చేసిన మార్గదర్శక కృషికి ఇది నివాళి అర్పిస్తోంది. ఈ స్టాంపుతో ప్రత్యేకంగా రూపొందించిన మొదటి కవర్, బ్రోషర్‌ను కూడా విడుదల చేశారు.

# ఆధార్ ఎప్పుడూ మొదటి గుర్తింపు కాదు

## - ఉడాయ్ సీఈవో భువనేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు

బీహార్ జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );బీహార్ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సాఐఖీ) కోసం ఆమోదయోగ్యమైన గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను మినహాయించడంపై వివాదం కొనసాగుతోంది. ఈ వివాదం వేళ భారత విశిష్ట ప్రాధికార సంస్థ స్పందించింది. ఈ మేరకు ఉడాయ్ సీఈవో భువనేశ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆధార్ ఎప్పుడూ మొదటి గుర్తింపు కాదని స్పష్టం చేశారు.ఓ ప్రత్యేక ఇంటర్వ్యూలో భువనేశ్ కుమార్ మాట్లాడుతూ.. ఫేక్ ఆధార్ కార్డులను కట్టడి చేసేందుకు ప్రత్యేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్యూఆర్ స్కానర్ యాప్‌ను అభివృద్ధి చేసినట్లు చెప్పారు. 'కొత్త ఆధార్ కార్డులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది.

ఉడాయ్ అభివృద్ధి చేసిన ఆధార్ క్యూఆర్ స్కానర్ యాప్ ద్వారా స్కాన్ చేసి వివరాలను సరిపోల్చుకోవచ్చు. ఈ యాప్ ద్వారా ఫేక్ ఆధార్ కార్డులను అడ్డుకోవచ్చు' అని తెలిపారు. ఈ కొత్త ఆధార్ యాప్ అభివృద్ధి దశలో ఉందని ఉడాయ్ చీఫ్ వెల్లడించారు.

# రైల్వేల్లో భారీగా ఉద్యోగాలు.. మొదటి త్రైమాసికంలో 9,000 మందికి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, జులై 10:55197 ఖాళీలతో కూడిన ఏడు వేర్వేరు నోటిఫికేషన్‌ల కోసం నవంబర్ 2024 నుంచి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు (ఆర్‌ఆర్‌బీ)... 1.86 కోట్లకు పైగా అభ్యర్థులకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సీబీటీ) నిర్వహించాయి. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 50,000 కంటే ఎక్కువ మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించేందుకు ఇది వీలు కల్పిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఇప్పటికే 9000 కంటే ఎక్కువ నియామక పత్రాలను ఆర్‌ఆర్‌బీలు జారీ చేశాయి.

ఆర్‌ఆర్‌బీ పరీక్షల కోసం కంప్యూటర్ ఆధారిత పరీక్షలను నిర్వహించడం అనేది ప్రణాళిక, సమన్వయంతో కూడుకున్న పెద్ద పని. అభ్యర్థుల నివాస స్థలాలకు దగ్గరగా పరీక్షా కేంద్రాలను కేటాయించాలని, ఈ విషయంలో మహిళ, దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్‌ఆర్‌బీలు ఇటీవల నిర్ణయం తీసుకున్నాయి. ఈ నిర్ణయానికి అనుగుణంగా పూర్తి పారదర్శకత, ఎవరికి అన్యాయం జరగకుండా పరీక్ష నిర్వహించేందుకు మరిన్ని పరీక్షా కేంద్రాలను, మానవ వనరులను సమకూర్చుకోవటం అవసరమవుతుంది.

ఆర్‌ఆర్‌బీలు ప్రచురించిన వార్షిక క్యాలెండర్ ప్రకారం 2024 నుంచి 1,08,324 ఖాళీలకు సంబంధించి పన్నెండు నోటిఫికేషన్లు ఇప్పటికే జారీ అయ్యాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం 2026-27లో అదనంగా 50,000 కంటే ఎక్కువ నియామకాలను ఆర్‌ఆర్‌బీలు చేపట్టనున్నాయి.

పరీక్షల నిష్పాక్షికతను పెంచేందుకు అభ్యర్థులను గుర్తించేందుకు ఆధార్ ఈ-కేవైసీని మొదటిసారిగా ఉపయోగించారు. ఇంత భారీ సంఖ్యలో అభ్యర్థులున్న పరీక్షలో ఇది 95 శాతం కంటే ఎక్కువ విజయవంతమైంది. ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారా మోసం చేసే అవకాశాన్ని తొలగించడానికి అన్ని పరీక్షా కేంద్రాలలో 100 శాతం జామర్‌లను ఇప్పుడు ఆర్‌ఆర్‌బీలు వినియోగిస్తున్నాయి.

# ఆచార్య రజనిశ్రీ సాహిత్య పురస్కారం

**-రచయిత మల్లారెడ్డికి దక్కిన అపూర్వ గౌరవం**
**-హైదరాబాద్ రవీంద్రభారతిలో 12న కార్యక్రమం**
**-నాలుగు సంవత్సరాలుగా పురస్కారాల ప్రదానం**
**-కళలు, సాహిత్యంపై రజనిశ్రీకి ఎంతో మక్కువ**
**-ఈసారి శ్రీకాకుళం జిల్లా వాసి మల్లారెడ్డికి చాన్స్**



పెద్దపల్లి, జులై 10: హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఈ నెల 12న ఆచార్య రజనిశ్రీ సాహిత్య పురస్కారం ప్రదానోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఏడాది రజనిశ్రీ పురస్కారానికి శ్రీకాకుళం జిల్లా కంచిలి గ్రామానికి చెందిన ఇండియన్ ఎయిర్ ఫోర్స్ రిటైర్డు అధికారి మల్లారెడ్డి మురళీ మోహన్ ఎంపికయ్యారు. ఈ పురస్కారం నాలుగేళ్లుగా ప్రదానం చేస్తున్నారు. మల్లారెడ్డి రాసిన నిశాచరుడి దివాస్వప్నం అనే కవిత సంపుటి ఎంపికైంది.

ఆచార్య రజనిశ్రీ ప్రస్థానం..

ఆచార్య రజనిశ్రీ అసలు పేరు గాజుల రాజేశం. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడు. 1944లో సిరిసిల్లలో జన్మించారు. వీరి స్వగ్రామం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి. ఆయన చేనేత కార్మిక కుటుంబానికి చెందిన వారు. ఎంఏ బీఈడీ చేసిన రాజేశం 1964 నుంచి 2002 వరకూ ఉపాధ్యాయులుగా పనిచేశారు. ఆయనకు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడు జి. వి. శ్యాంప్రసాద్ లాల్ ( కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి), రెండవ కుమారుడు హరీష్ కుమార్ (హైకోర్టులో న్యాయవాది), మూడో కుమారుడు క్రాంతి కుమార్ (సాఫ్ట్వేర్ ఇంజనీర్). ఆయనకు కళలు, సాహిత్యంపై మక్కువ. అందుకే ఈ రెండింటిపై ఆయన ప్రయాణం సాగింది.

### కళలు వైపు ప్రయాణం..

రజనిశ్రీకి కళలపై మక్కువ అని గ్రహించిన గంగం తిరుపతిరెడ్డి 1955లో హైదరాబాద్ ఆకాశవాణి కేంద్రంలో పాటలు పాడించారు. అదే సందర్భంలో మలయశ్రీతో పరిచయం కావడంతో సాహిత్యం వైపు కూడా ఆయన ప్రయాణం సాగింది. ప్రఖ్యాత నాట్యచార్యులు నటరాజ రామకృష్ణ వద్ద శిష్యరికంలో ఆంధ్రనాట్యం, అంజిబాబు వద్ద కథక్ నృత్యాన్ని నేర్చుకున్నారు. తాను పనిచేసే పాఠశాల విద్యార్థులకు ఆంధ్ర నాట్యం కూడా నేర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఇటు ఆంధ్ర నాట్యం, అటు కథక్ తోపాటు జానపద పాటలకు సొంతంగా నృత్య రూపకాలు రూపొందించి ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకాదరణ పొందింది. వేమన నాటకంలోని దేవదాసి, శ్రీకృష్ణతులాభారంలోని సత్యభామ, రుక్మిణి, నళిని, సత్యహరిశ్చంద్రలో చంద్రమతి, రామాంజనేయ యుద్ధంలో శాంతిమతి, అల్లూరి సీతారామరాజులో సీత, వరూధిని ప్రవరాఖ్యలో వరూధిని పాత్ర పోషించి ఆ పాత్రలకు జీవం పోశారు.

సాహిత్యం వైపు..

రజనిశ్రీ తాను నటించిన నాటకాలల్లో ఎక్కువ భాగం తానే స్వయంగా రాసుకొని వాటికి నృత్య రూపం ఇచ్చినవే ఎక్కువగా ఉన్నాయి. చైతన్య గీతాలు పేరుతో పాటల పుస్తకాన్ని వెలువరించారు. నాట్య కళా వైభవం అనే పుస్తకం రచించారు. కేవలం నాట్యం, నటన, దర్శకత్వం, కవిత్వం, గేయ రచయిత గానే కాకుండా కళాజ్యోతి కల్చరల్ అసోసియేషన్, నటరాజు నృత్య కళాక్షేత్రం వంటి సాంస్కృతిక, కళా సంస్థలను స్థాపించి ఎందరో ఔత్సాహిక నటులకు అవకాశం ఇచ్చారు. మరెందరినో తీర్చిదిద్దారు. ఇలా తన జీవితమంతా సాహిత్య, సాంస్కృతిక కళలకే ధారపోసిన మహానుభావుడు.

### రజనిశ్రీ అందుకున్న పురస్కారాలు

1976లో నాట్య విశారద ను వరంగల్ కాకతీయ కల్చరల్ అకాడమీ ప్రదానం చేసింది

1980లో నాట్యరత్న పురస్కారాన్ని ముఖ్యమంత్రి టి. అంజయ్య ప్రదానం చేశారు.

నాట్య మయూరి పురస్కారాన్ని నెల్లూరు నెఫ్జా నాటక కళాపరిషత్ ప్రదానం.

1984లో గాంధీ విచారమంచ్ వారిచే నాట్య నిష్ణాత ప్రదానం

1986లో సారస్వత జ్యోతి మిత్రమండలి వారిచే నాట్య కళా ప్రపూర్ణ

1988లో మనోరంజని పురస్కారం

1990లో మనోరంజని వారిచే ఉపాధ్యాయ రత్న

1992లో కనకదుర్గ కల్చరల్ అకాడమీ, విజయవాడ వారిచే నాట్య కౌముది

1996లో మనోరంజనీ హైదరాబాద్ వారిచే ఎన్టీఆర్ స్మారక అవార్డు

1998లో అన్నమయ్య కల్చరల్ అకాడమీ కరీంనగర్ వారిచే ప్రజావాద కళారత్న

1999లో కళావాహిని మంచిర్యాల వారిచే నృత్యశ్రేష్ట

1999లో భావన ఆర్ట్ అకాడమీ బద్వేల్ కడప వారిచే కళాసామ్రాట్, రాగా కల్చరల్ అకాడమీ జాక్ వారిచే రాగా పురస్కారం

2000లోస్ఫూర్తి అసోసియేషన్ వారిచే స్ఫూర్తి అవార్డు

2001లో పద్మ పీఠం వారిచే పద్మ పీఠం అవార్డు

2004లో నటరాజ నృత్య కళానికేతన్ ఖమ్మం వారిచే నాట్య కళానిధి

2005లో రాగ మయూరి ఆర్ట్ థియేటర్ వారిచే రాఘమయూరి పురస్కారం అందుకున్నారు.

# వడోదరలో గంభీర బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలి

**-కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ డిమాండ్**

న్యూఢిల్లీ, జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గుజరాత్‌లోని వడోదరలో నిన్న గంభీర బ్రిడ్జి కూలిపోయిన ఘటనపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ఈ దుర్ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారన్న ప్రియాంక గాంధీ.. భారీ బ్రిడ్జి కూలడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద ప్రాంతంలో రెండవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ, అదే సమయంలో దర్యాప్తు కూడా జరగాలని ప్రియాంక గాంధీ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కూడా ఈ అంశంపై స్పందించారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గుజరాత్ వంతెన కూలిపోవడం, అహ్మదాబాద్ విమాన ప్రమాదం వంటి ఇటీవలి విషాదాలు నాయకత్వ సంక్షోభం, అవినీతి, అసమర్థత ఫలితంగా జరిగాయని ఆరోపించారు. వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా విలేకరులతో మాట్లాడుతూ, 'ఇవాళ మరో మూడు మృతదేహాలను వెలికితీయడంతో మృతుల సంఖ్య 15కి చేరుకుంది. నలుగురు గల్లంతయ్యారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం 4 కి.మీ. మేర గాలింపు, రక్షణ చర్యలు నిర్వహిస్తున్నాయి' అని చెప్పారు. నదిలోకి పడిపోయిన రెండు వాహనాల గురించి ప్రజల నుండి వివరాలను కోరుతున్నామన్నారు. వర్షం పడుతుండటంతో, నదిలో నీటి మట్టం పెరిగిందని కలెక్టర్ తెలిపారు. అయితే, విరిగిన వంతెనపై వేలాడుతున్న ట్రక్కు గురించి అడిగినప్పుడు, 'ఇది ఖాళీ ట్యాంకర్. మేము దానిని తరలిస్తే, అది కింద పడిపోవచ్చు. సరిగ్గా కిందనే సహాయక చర్యలు జరుగుతున్నందున లారీని స్థిరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం' అన్నారు. ఇలా ఉండగా, బ్రిడ్జి కూలిన ఘటనలో మృతుల సంఖ్య నేడు 15కి పెరిగిందని, ఇవాళ మరో మూడు మృతదేహాలను వెలికితీసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. గల్లంతైన నలుగురి కోసం గాలింపు, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. వడోదర - ఆనంద్‌లను కలిపే భారీ గంభీర బ్రిడ్జిలో కొంత భాగం కూలిపోయి దిగువన ఉన్న మహిసాగర్ నదిలో పడిపోయిన సంగతి తెలిసిందే.

# ఇన్‌కం ట్యాక్స్ 2025 ఫైలింగ్ విషయంలో కొత్త మార్పులు

న్యూ డిల్లీ జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇన్‌కం ట్యాక్స్ 2025 ఫైలింగ్ విషయంలో కొత్త మార్పులు వచ్చాయి. ఈ మార్పులు పన్ను దాఖలు ప్రక్రియను మరింత సురక్షితంగా, పారదర్శకంగా మార్చే ఉద్దేశంతో తీసుకొచ్చారు. ఈ కొత్త నిబంధనలు తెలుసుకుని ముందుగానే పాటించడం ద్వారా, ఫైలింగ్ సమయంలో ఇబ్బందులు లేకుండా ఉండవచ్చు.

### ఇన్‌కం ట్యాక్స్ 2025 కొత్త రూల్స్.. ఈ అప్‌డేట్ ప్రక్రియ తప్పనిసరి

మీరు ఇన్?కం ట్యాక్స్ ఫైల్ చేస్తున్నారా. అయితే ఓసారి కొత్తగా మారిన రూల్స్ గురించి తెలుసుకోండి మరి. ఎందుకంటే ఆదాయపు పన్ను శాఖ ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో ఇమెయిల్ ఐడీ లేదా మొబైల్ నంబర్‌ను అప్‌డేట్ చేయడానికి ఖాఖ ప్రమాణీకరణని తప్పనిసరి చేసింది. ఈ కొత్త విధానాన్ని భద్రతను పెంచడం, దుర్వినియోగాన్ని నివారించడానికి ప్రవేశపెట్టారు. ఇది ప్రస్తుతం పన్ను చెల్లింపుదారుల వివరాల గుర్తింపును నిర్ధారించడం కోసం అమలులోకి వచ్చింది. ఈ మార్పులు పన్ను వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చడానికి ఉద్దేశించినవి.

### ఎందుకు తప్పనిసరి..

ఈ రూల్ అనధికార మార్పులను నిరోధించడానికి రూపొందించారు. ఆ క్రమంలో ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు ఖాఖ పంపబడుతుంది. దీనివల్ల నిజమైన ఖాతాదారుడు మాత్రమే సంప్రదింపు వివరాలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇది ఖాతా హ్యాకింగ్ లేదా దుర్వినియోగం అవకుండా రక్షిస్తుంది. కాగా, డిజిటల్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పన్ను దాఖలు, రీఫండ్ ప్రక్రియను మరింత సురక్షితంగా చేసేందుకు ఈ కొత్త విధానాన్ని తీసుకువచ్చారు.

### కొత్త పాన్ కార్డ్ దరఖాస్తులకు ఆధార్ తప్పనిసరి..

జూలై 1, 2025 నుంచి కొత్త పాన్ కార్డ్ దరఖాస్తులకు ఆధార్ తప్పనిసరి చేశారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్ ఖాఖ ప్రమాణీకరణ పూర్తి చేయాలి. ఆధార్ లేకపోతే కొత్త పాన్ కార్డ్ జారీ చేయబడదు. గతంలో డేట్ ఆఫ్ బర్త్ లేదా ఇతర గుర్తింపు కార్డులతో పాన్ కార్డ్ కోసం అప్లై చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఇప్పుడు ఆ ఆప్షన్ తొలగించబడింది. ఇప్పటికే పాన్ కార్డ్ కలిగి ఉండి, దానిని ఆధార్‌తో లింక్ చేయని వారు డిసెంబర్ 31, 2025 లోపు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. లేకపోతే, వారి పాన్ కార్డ్ నిరుపయోగంగా మారుతుంది. ఆలస్యంగా లింక్ చేస్తే రూ. 1,000 జరిమానా విధిస్తారు.

### పన్ను చెల్లింపుదారులు ఏం చేయాలి

ఇమెయిల్/మొబైల్ నంబర్ అప్‌డేట్: ఈ-ఫైలింగ్ పోర్టల్‌లో సంప్రదింపు వివరాలను మార్చాలనుకునే వారు ఆధార్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఖాఖని ఉపయోగించి ప్రమాణీకరణ పూర్తి చేసుకోవాలి.కొత్త పాన్ దరఖాస్తు: కొత్తగా పాన్ కార్డ్ కోసం అప్లై చేసే వారు ఆధార్ నంబర్‌ను తప్పనిసరిగా అందించాలి. OTP ప్రమాణీకరణ పూర్తి చేయాలిపాన్-ఆధార్ లింకింగ్: ఇప్పటికే పాన్ కార్డ్ ఉన్నవారు 2025 డిసెంబర్ 31లోపు ఆధార్‌తో లింక్ చేసుకోవాలి. లేకపోతే జరిమానాతో పాటు పాన్ నిరుపయోగంగా మారుతుంది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 నుంచి 34 శాతం జీతాలు పెంపు

న్యూఢిల్లీ, జులై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్); కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మోదీ సర్కారు శుభవార్త చెప్పింది. 8వ వేతన సంఘం ఇచ్చే నివేదిక ఆధారంగా ఉద్యోగుల జీతాలను పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఒక చర్చ సాగుతోంది. దీని ప్రకారం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 30 నుంచి 34 శాతం జీతాలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. పెరిగిన ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని వేతన సంఘం ఈ మేరకు సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఈ పెంచిన జీతాలు 2026 జనవరి నుంచి అమలులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ 8వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం వేతనాలు పెంచినట్లయితే.. దాదాపు 11 మిలియన్ల మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరే అవకాశం ఉంది. ఇదిలాఉంటే.. ప్రతి పదేళ్లకు ఒకసారి వేతన సంఘాన్ని కేంద్రం నియమిస్తున్న సంగతి తెలిసిందే. 2016లో మోదీ సర్కార్ 7వ వేతన సంఘాన్ని నియమించింది. అప్పుడు అత్యల్పంగా 14 శాతం మేర జీతాలను పెంచారు. మళ్లీ ఈ ఏడాది 8వ వేతన సంఘాన్ని కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ సంఘం సిఫారసు మేరకు ఉద్యోగుల వేతనాలను పెంచనున్నారు.

# వచ్చే ఐదేళ్లలో కొత్తగా పట్టాలు ఎక్కనున్న వెయ్యి రైళ్లు

**-కంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడి**



న్యూఢిల్లీ, జులై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేశంలో జనాభా విపరీతంగా పెరుగుతోంది. అందుకు అనుగుణంగా ప్రయాణ సౌకర్యాలు పెరగడం లేదంటూ సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాంటి వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే ఐదేళ్లలో కొత్తగా వెయ్యి రైళ్లను పట్టాలు ఎక్కించాలని భారతీయ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ గురువారం న్యూఢిల్లీలో వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో ఈ కొత్త రైల్వే సర్వీసులు ప్రారంభిస్తామన్నారు. 2027 నాటికి దేశంలో బుల్లెట్ రైలు ప్రారంభించడమే భారతీయ రైల్వే లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు. రైల్వే ఎగుమతులు ద్వారా ప్రపంచంలోనే భారత్ కీలక పాత్ర పోషించనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇక రైల్వే ద్వారా సరుకు రవాణాలో ఇది దేశానికే వెన్నుముకగా నిలవనుందన్నారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా 35 వేల కిలోమీటర్ల మేర కొత్త రైల్వే ట్రాక్‌ను నిర్మించామని వివరించారు.

ఇది జర్మనీ దేశంలోని మొత్తం రైల్వే ట్రాక్‌తో సమానమని సోదాహరణగా చెప్పారు. ఒక్క ఏడాదిలోనే 5,300 కిలోమీటర్ల మేర ట్రాక్‌ను భారతీయ రైల్వే నిర్మించిందని చెప్పారు. ఏడాదిలో 30 వేల వ్యాగిన్లు, 15 వందల లోకోమోటివ్‌లను భారతీయ రైల్వే తయారు చేస్తుందని పేర్కొన్నారు. ఇది ఉత్తర అమెరికా, యూరప్ తయారు చేస్తున్న రైల్వే వ్యాగిన్ల కంటే అధికమన్నారు. మరోవైపు భారతీయ రైల్వేలో పెట్టబడులు రూ. 2 వేల కోట్ల నుంచి రూ. 2.25 లక్షల కోట్లు ఏగబాకాయని చెప్పారు. అందులో రూ. 20 వేల కోట్లు.. పీపీపీ ద్వారా అదనంగా వచ్చాయని ఆయన వివరించారు. జపాన్ సహకారంతో బుల్లెట్ రైలు తయారు చేస్తున్నామన్నారు. ఇది 2026 నాటికి పూర్తవుతుందని భావిస్తున్నామని తెలిపారు. 2027లో దీనిని ప్రారంభిస్తామన్నారు. ఇక ఏడాదిలో రైళ్లు పట్టాలు తప్పిన ఘటనలు 170 నుంచి 30కి తగ్గాయన్నారు. మొత్తంగా పరిశీలిస్తే.. రైలు ప్రమాదాలు 80 శాతం మేర తగ్గాయని వివరించారు. ట్రాకులు అప్ గ్రేడ్ చేయడం.. పాయింట్స్, సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రతి రోజు సమీక్షించడం ద్వారా ఈ ప్రమాదాల నివారించడం సాధ్యమైందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరించారు.


# కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు హైదరాబాద్ వాసులు మృతి




అమరావతి జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మండలంలో గురువారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కాల్వబుగ్గ ప్రాంతం కాశిరెడ్డినాయన ఆశ్రమం సమీపంలో ట్రాక్టర్‌ను స్కార్పియో వాహనం ఢీకొట్టడంతో ముగ్గురు చనిపోయారు. పోలీసుల ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన ఆరుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో మహిళ పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. మృతులు షేక్ కమల్ బాషా(50), మున్ని(35), షేక్ నదియా(03)గా గుర్తించారు. ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి కడప జిల్లాలోని మైదకూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది: ప్రావీణ్య, జిల్లా కలెక్టర్

**-ప్రధానమంత్రి కార్యాలయ అధికారినితో కలిసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పరిశీలించిన కలెక్టర్.**



సంగారెడ్డి జూలై 10(నేటి నిజం ప్రతినిది) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలకు పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, డబుల్ బెడ్ రూమ్ పథకాలలో పక్క ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య అన్నారు.

గురువారం ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వి కర్ణన్ లతో కలిసి కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారులతో జరిగిన ముఖాముఖి సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కాలనీలో ప్రభుత్వం నిర్మించి ఇచ్చిన రెండు పడక గదుల ఇండ్లను ప్రధానమంత్రి కార్యాలయ అధికారిని మన్మిత్ కౌర్ కలెక్టర్ ప్రావిణ్య, జిహెచ్ఎంసి కమిషనర్లు పరిశీలించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో గల వసతులను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు మెరుగైన వసతుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు, బ్యాంక్ సౌకర్యాలు, పోస్ట్ ఆఫీస్ ప్రైమరీ ఇంటర్ సెంటర్ అంగన్వాడి కేంద్రం,ప్రభుత్వ పాఠశాలు , ఇతర సౌకర్యాలు , వసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. దీంతోపాటు మెరుగైన రవాణా వసతుల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు తెలిపారు. 2 బీహెచ్ కె కాలనీ నుండి హైదరాబాదులోని అన్ని ప్రాంతాలకు బస్సు రవాణా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

లబ్ధిదారులు తమ వాటాగా పరిసరాల పరిశుభ్రత కోసం కృషి చేయాలని సూచించారు. తమ ఇండ్ల ఆవరణలో పచ్చని చెట్లు మొక్కలు నాటడం వల్ల ఆహ్లాదకర వాతావరణం ఏర్పడుతుందని ఆ దిశగా లబ్ధిదారులకు కృషి చేయాలని అన్నారు.

అనంతరం అల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహిళా సాధికారతలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను అధికారులు పరిశీలించారు స్వశక్తితో క్యాంటీన్ నడిపిస్తున్న మహిళలను అభినందించారు. మహిళాసాధికారత ,మహిళలఆర్థిక స్వాలంబనకోసం రాష్ట్ర ప్రభుత్వం మహిళ శక్తి కార్యక్రమంలో భాగంగా వివిధ వ్యాపారాలలో రాణించడానికి కృషి చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు.

# గురువులను సత్కరించిన బీజేపీ ఎస్సీ మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్




గోదావరి ఖని జూలై 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):గురు పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక జీఎం కాలనీ క్రీడా మైదానంలో వివిధ క్రీడా రంగాలకు చెందిన గురువులను గురువారం ఉదయం ఘనంగా సన్మానం చేశారు. బీజేపీ ఎస్సీ మోర్చ జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ క్రీడల్లో సేవలందిస్తున్న గురువులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ కుమార్ మాట్లాడుతూ గురువులను సన్మానించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. కళలకు నిలయమైన కోల్‌బెల్ట్ ప్రాంతంలో క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శన చేసి విజేతలుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అందుకు ప్రధాన కారణం ఈ ప్రాంత గురువులేనని పేర్కొన్నారు. వారి శిక్షణలో వేలాది మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారు. గోదావరిఖని ప్రాంత విజేతలు క్రీడల్లో నైపుణ్యం వల్ల పోలీస్, సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. ఈ విజేతలకు నిత్యం శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్న గురువులను సన్మానించడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ ప్రధాన కార్యదర్శి కాసిపేట శివాజీ, బీజేపీ జనగామ మండల అధ్యక్షుడు జీ భూమయ్య, సీనియర్ నాయకులు మహవాది రామన్న, జనహిత శ్రీను, ఈ ఉపేందర్, శ్రీనాథ్, విశ్వనాథ్, తడగొండ నర్సయ్య, ఎస్ హరీష్, కల్లెపల్లి శ్రీనివాస్, బియ్యాల మహేందర్, మేడగోని రవి, రాజు, చంద్రశేఖర్, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు ఐఐటీ ర్యాంకర్ ఆదర్శకు ఆశీస్సులు



ఖమ్మం, జులై 10:(నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)వి ద్యార్థి ఆదర్శను ఆశీర్వదించారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ కుమారుడు ఆదర్శ జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్ సాధించి చెన్నై ఐఐటీలో సీటు పొం దారు. ఈ సందర్భంగా రవికుమార్ తన కుమారుడు ఆదర్శను వెంట తీసుకుని గురువారం ఖమ్మం బుర హాన్ పురంలోని క్యాంప్ కార్యాల యంలో ఎంపీ రవిచంద్రను మర్యా దపూర్వకంగా కలిశారు. ఆదర్శను అభినందిస్తూ ఎంపీ వద్దిరాజు శాలు వాతో సత్కరి ంచి, చద ువుపై మరింత శ్రద్ధాసక్తులు పెం చుకుని జీవితంలో గొప్పగా ఎదగాలని ఆశీర్వదించారు, రవికు మార్ కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# హెచ్‌సీఏ కమిటీని రద్దు చేసి ఎన్నికలు జరపాలి - అజారుద్దీన్ డిమాండ్



హైదరాబాద్, జులై 10: అవినీతి ఊబిలో కూరుకుపోయిన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రస్తుత కమిటిని రద్దు చేసి వెంటనే ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు, టీమిండియా మాజీ కెప్టెన్ మహమ్మద్ అజారుద్దీన్. ఉచిత ఐపీఎల్ టికెట్ల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎన్ఆర్ హెచ్) ఫ్రాంచైజీని బెదిరించారనే ఆరోపణలతో పాటు, నిధుల దుర్వినియోగం, ఫోర్జరీ కేసుల్లో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకోవడం క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

దీనిపై నేడు మీడియాతో అజారుద్దీన్ మాట్లాడుతూ, హెచ్‌సీఏ అధ్యక్షుడి అరెస్ట్ ఆ సంస్థకే పెద్ద అవమానమని అన్నారు. ఐపీఎల్ టికెట్ల విషయంలో అదనపు టికెట్లు ఇవ్వాలని ఒత్తిడి చేయడం, అందుకు ఒప్పుకోకపోతే వేధించడం దారుణమని అన్నారు. గ్రూపు రాజకీయాలను పక్కనపెట్టి ఆటపై దృష్టి సారించాలని ప్రస్తుత సభ్యులకు ఆయన సూచించారు. అవకాశం వస్తే హెచ్‌సీఏ బాధ్యతలను మళ్లీ స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అజారుద్దీన్ ప్రకటించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.